క్లుప్తంగా

పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

పెనుబల్లి: మండలంలోని లంకపల్లి పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేలా కష్టపడి చదవాని, సమయపాలన పాటించాలని సూచించారు. అదే పాఠశాలలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యతో పాటు ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరు: మండలంలోని రేపల్లెవాడలో నూతనంగా నిర్మించిన చర్చిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలసి కట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, స్వర్ణ నరేందర్, భూక్యా లాలు, దళపతి వెంకటేశ్వర రాజు, శివకుమార్, నర్సింహారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు మేడేపల్లి విద్యార్థి



విద్యార్థికి నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ముదిగొండ: ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బొడ్డు విక్రమ్ అండర్-19 విభాగంలో జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బియ్యని కృష్ణయ్య తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 28 నుంచి మహారాష్ట్రలోని లాతూర్‌లో జరుగుతాయన్నారు. ఇటీవల నల్గొండలోని జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ అండర్-19 విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విక్రమ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అభినందించి ప్రయాణ కర్చులకు రూ.2 వేలు అందించారు. విద్యార్థిని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ లాలయ్య, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మేడేపల్లి సర్పంచ్ సామినేని రమేష్‌లు అభినందించారు.

శివాలయ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడులో గల శ్రీదుర్గామల్లేశ్వర సమేత కాశీ విశ్వేశ్వరస్వామి శివాలయం ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 14 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి నాగేశ్వరరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, కొల్లి నర్సింహారావు, మారుతి సూరిబాబు, అంకమరాజు, సత్యనారాయణ, బ్రహ్మాచారి, దూదిపాల రాంబాబు, మానుకోట మధు, శ్రీనివాసరావు, వీరాస్వామి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. పలు తీర్మాణాలను ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ కె.సుజాత, వైఎస్ చైర్మన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు ఎస్‌కె చాంద్‌పాషా, రఘు, అనిల్, విజయనిర్మల, సూరిబాబు, సలీమాఖాతూన్, నడ్డి జమలమ్మ, నాగుల్ మీరా పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగికి బహుమతి

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా స్థాయిలో ఇటీవల ఉద్యోగులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సర్వే మజ్దూర్ ఎనుమల రాము ద్వితీయ బహుమతి సాధించారు. ఆయనకు జీఎం షాలేంరాజు బహుమతి అందించి అభినందించారు.

ప్రజలకు జవాబుదారీగా పాలన

- ప్రగతి యాత్రలో గుర్తించిన సమస్యలన్నీ పరిష్కరించా..
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మధిర మండలం బయ్యారంలో మాట్లాడుతున్న భట్టి



చింతకానిలో భట్టి విక్రమార్క సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిర: ప్రభుత్వంలోని ప్రతీ వ్యవస్థ, అధికారి ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రజాపాలన సాగిస్తున్నారని.. అదే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిర మండలంలోని బయ్యారంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో అదనపు తరగతి గదులు, నిదానపురంలో ఆరోగ్య ఉపకేంద్రం భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బయ్యారం, మడుపల్లి మధ్య చెరువును అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు భయంభయంగా, ఇప్పుడు స్వేచ్ఛగా జీవిస్తున్నారని చెప్పారు. కాగా, ఎమ్మెల్సీగా మధిర నియోజకవర్గంలో ప్రగతియాత్ర చేసిన సందర్భంగా వచ్చిన గుర్తించిన సమస్యలను 2009లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పరిష్కరించానని భట్టి వెల్లడించారు. సర్పంచ్‌లు జి.ప్రకాశమ్మ, సర్పంచ్ నిడమనూరి సంధ్య వంశీ, ఎంపీటీసీ జయరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్‌తో పాటు కమతం రమేష్, బండారు సత్యవతి, వెంకటశివరావు, పరిమి బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని మండలంలో సుడిగాలి పర్యటన..

చింతకాని: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చింతకాని మండలంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. నాగులవంచ, చినమండవ, కొదుమూరు, చింతకాని గ్రామాల్లో ఆయన పర్యటించారు. వీవీసీ, వీవీఆర్ ట్రస్ట్ ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన నాగులవంచ ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్, వాటర్ ప్లాంట్, రైతు వేదిక, చినమండవలో పల్లె దవాఖానా, కొదుమూరులో సబ్‌స్టేషన్, గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎంగా మొదటిసారి మండలానికి వచ్చిన భట్టి విక్రమార్కకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్‌లు ఆలస్యం నాగమణి, కాశిమాల వెంకట్రావమ్మ, నక్కనబోయిన సుజాత, డీపీఓ హరికిషన్, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, వివిధ శాఖల అధికారులు రామారావు, హీరాలాల్ నాయక్, కొంగర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మల్లెల రవీంద్రప్రసాద్, రమేష్, మోదుగు శ్యాంసన్, అల్తాఫ్, పల్లెల నాగయ్య, సీహెచ్.వెంకన్న, ఉమామహేశ్వరి పాల్గొన్నారు. అలాగే, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మహాసభల పోస్టర్లను భట్టి ఆవిష్కరించారు. ఇక ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ తదితరులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.

ప్రజా సంక్షేమమే పరమావధి..

ప్రజాపాలనలో ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని డిప్యూటీ సీఎంమల్లు భట్టివిక్రమార్క తెలిపారు. చింతకానిలో శనివారం రాత్రి జరిగిన పౌరసన్మాన సభలో ఆయన మాట్లాడారు. మధిర నియోజకవర్గ ప్రజలను ఎన్నటికి మర్చిపోలేనని, రాష్ట్రంలోనే మధిర నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ డెయిరీని ఏర్పాటుచేయనున్నామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారానికో రోజు నియోజకవర్గంలో ఉంటానని తెలిపారు. మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న స్త్రీ శక్తి భవన నిర్మాణం, రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భట్టిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్, కోట రాంబాబు, పూర్ణయ్య, అంబటి వెంకటేశ్వర్లు, జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు పాల్గొన్నారు.

కిష్టారం సమస్యలు పరిష్కరించండి

కొత్తగూడెం జీఎం షాలేంరాజుకు వినతి



జీఎం షాలేంరాజుకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత గ్రామమైన కిష్టారంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు కొత్తగూడెం జీఎం షాలేంరాజును వినతిపత్రం అందించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ కార్యాలయంలో జీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. హైస్కూల్‌లో విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని, పాఠశాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువుకట్టపై బీటీరోడ్డు నిర్మించాలని, అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిష్టారం పీఓ నర్సింహారావు, కిష్టారం సర్పంచ్ చెట్టుమాల రేణుకా, నాయకులు ఉడతనేని అప్పారావు, మామిళ్లపల్లి కృష్ణయ్య, నరుకుళ్ల శేషగిరిరావు, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భాగ్యనగర్ సమస్యలపై ఇల్లెందు జీఎంకు..



జీఎం జాన్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామ పంచాయతీ సమస్యలపై గ్రామ యువకులు సింగరేణి కాలరీస్ ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణి ఓపెన్ కాస్టు, సోలార్ ప్లాంట్ ప్రభావిత ప్రాంతమైన భాగ్యనగర్‌తండా గ్రామ పంచాయతీని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీహాల్ మంజూరు చేయాలని, ఆర్‌ఓ ప్లాంట్‌కు అదనపు మిషనరీని ఏర్పాటు చేయాలని, గ్రామంలో అధ్వానంగా ఉన్న గ్రావెల్ రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ హర్షానాయక్, లావూడ్యా రాజ్‌కుమార్, బానోత్ వినోద్ రాథోడ్, గుగులోత్ రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

31లోగా ఈకేవైసీ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సివిల్ సప్లయీస్ డీటీ సీహెచ్ సత్యనారాయణ

వేంసూరు: ఈ నెల 31లోగా రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతీ ఒక్కరి ఈ కేవైసీ చేయించాలని రేషన్ డీలర్లకు సివిల్ సప్లయీస్ డీటీ సీహెచ్ సత్యనారాయణ సూచించారు. శనివారం మండలంలోని మర్లపాడులో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31తో ఈ కేవైసీ గడువు ముగినుండటంతో ఇంకా ఈ కేవైసీ చేయించుకొని వారితో తప్పక చేయించాలన్నారు. ప్రస్తుతం కార్డులో పేరు కలిగిన వారు ఈకేవైసీ చేయించుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గ్యాస్ డెలవరీ బాయ్స్ వద్ద గ్యాస్ కనెక్షన్ ఈకేవైసీ చేసే విధంగా చర్యలు చేపట్టమని గ్యాస్ బండ తీసుకోవడంతో పాటు కేవైసీ చేయించుకోవాలని, అదే విధంగా పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు రంగారావు, రాజారావు, రామకృష్ణ, సత్యనారాయణ, కేశవరెడ్డి, లచ్చిరామ్, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల సమావేశం



వైరా: మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వీరస్వామి

వైరా: తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం వైరా శాఖ ఆధ్వర్యంలో శనివారం వైరాలో ఆ సంఘం సభ్యత్వ నమోదు, డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరస్వామి మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులకు విద్యాబోధన కుంటుపడుతుందన్నారు. రెండో విడత స్కూల్ గ్రాంట్స్ విడుదల చేయాలని.. అన్ని హైస్కూళ్లలో ఎల్‌డీసీ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, స్వీపర్ కమ్ నైట్ వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు మార్క్, విజయాబాబు, మాధవరావు, మల్లీశ్వరి, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ జెడ్పీ పాఠశాలను శనివారం గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం సందర్శించింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరస్వామి మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోతే పదో తరగతి పరీక్షా ఫలితాలపై ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో తల్లాడ, వైరా ఎంఈఓలు ఎస్.దామోదరప్రసాద్, తల్లాడ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన, ఎ.జోజప్ప, ఎ.రమేష్, బి.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి సీఐగా కిరణ్



సీఐ టి.కిరణ్

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణ సీఐ జె.మోహన్‌బాబు బదిలీ అయ్యారు. ఆయనను ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. పట్టణ సీఐగా టి.కిరణ్ బదిలీపై రానున్నారు. ఆయన ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ సీఐగా పని చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవం



మామిడి మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

కొణిజర్ల: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కొణిజర్ల మండలం బస్వాపురం గ్రామంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమ్లా ఖమ్మం నుంచి మామిడి సపోటా మొక్కలు కొని తెచ్చి పాఠశాల ఆవరణలో నాటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమలరావు, కృష్ణారావు, మురళీధరరావు, వెంకటేశ్వర్లు, సక్రాం, సీఆర్‌టీలు భాస్కర్ , నాగేశ్వరరావు, నెహ్రూ అశోక్‌కుమార్, రాంకిషన్ పాల్గొన్నారు.

దుకాణదారులకు హెచ్చరిక

- ఆర్‌అండ్‌బీ రహదారి ఆక్రమణపై నోటీసులు
- 48గంటల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలి



దుకాణదారులకు నోటీసులు అందజేస్తున్న గ్రామ కార్యదర్శి యాకలక్ష్మి

కారేపల్లి: కారేపల్లి తహసీల్ నుంచి నుంచి అంబేడ్కర్ సెంటర్, సినిమాహాల్ సెంటర్, బస్టాండ్ సెంటర్‌ల మీదుగా పోలీసు స్టేషన్ సర్కిల్ వరకు ఉన్న ఆర్అండ్‌బీ 4లైన్ల రహదారిని ఆక్రమించి, కట్టడాలు నిర్మించుకున్న దుకాణాదారులు స్వచ్ఛందంగా తమ నిర్మాణాలను తొలగించుకోవాలని.. సింగరేణి (కారేపల్లి) గ్రామ పంచాయతీ కార్యదర్శి యాకలక్ష్మి శనివారం దుకాణాదారులకు నోటీసులను అందజేశారు. 48గంటల్లో కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోకపోతే, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించబడుతాయని ఆమె హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. రెండేళ్ల క్రితం ఇదే రహదారిలో దుకాణాదారులు ముందుకు వచ్చి నిర్మించుకున్న కట్టడాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ చంద్రశేఖర్ పొక్లెన్లతో కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. కొంతమంది దుకాణాదారులు తిరిగి ఆర్అండ్‌బీ రహదారికి అనుకొని నిర్మాణాలు చేపట్టడం, పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురికావటంతో.. అధికారులు రెండో దఫా ఆక్రమణలను తొలగించేందుకు పూనుకున్నారు.

‘గ్రామీణ బంద్’ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామయ్య

వైరా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా, మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఫిబ్రవరి 16న చేపట్టే పారిశ్రామిక, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని భారత కార్మికసంఘాల ఐక్య సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. శనివారం వైరాలో విక్రమ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాయింట్ ప్లాట్ ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత స్థాయిలో గ్రామీణ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తైందని కార్మిక, రైతు వ్యతిరేక ప్రభుత్వంగా తయారైందన్నారు. 2024లో ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి శ్రామిక శక్తులు ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి శ్రీనివాసరావు, ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, శరత్, రామదాసు, శ్రీనివాస్ లాల్‌మియా, పుల్లారావు, వెంకన్న పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



వైరా: కమిషనర్ కరుణాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఉద్యోగులు

వైరా: 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న వైరా ఎంపీడీఓ, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ డి.కరుణాకర్ రెడ్డిని శనివారం వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పురపాలక సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో ప్రిన్సిపాల్ పద్మావతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును కలెక్టర్ వీపీ గౌతమ్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం ఆమెను స్థానిక పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఆమె అందిస్తున్న సేవలను ప్రశంసించారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని డాక్టర్ కేవీఆర్ సీఎస్ఆర్ ఆధిత్య పాఠశాల డైరెక్టర్ చలసాని శ్రీవైష్ణవి అన్నారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మండల స్థాయి చెకుముకి పోటీలు



సత్తుపల్లి: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సత్తుపల్లి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన పట్టణంలోని పాతసెంటర్ హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి చెకుముఖి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. 8, 9, 10వ తరగతులకు సంబంధించి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 87 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు కాకర్లపల్లి, అయ్యగారిపేట, వివి విద్యాలయం పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. మండల స్థాయిలో కాకర్లపల్లి, కిష్టారం, బాలికల హైస్కూల్ విద్యార్థులు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎంలు శైలకుమారి, యాకోబ్, జన విజ్ఞానవేదిక నిర్వాహకులు సాంబశివారెడ్డి, కంభంపాటి వెంకటేశ్వరరావు, ప్రసాద్, సత్యనారాయణరెడ్డి, బాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కల్లూరు మండలంలో..



కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో..

కల్లూరు: మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు విజేతలకు కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేశారు. ఎంఈఓ దామోదర ప్రసాద్ ప్రశ్నాపత్రాలను ప్రారంభించి.. శాస్త్రీయ విజ్ఞానం యొక్క ఆవశ్యకతను తెలిపారు. విజేతలకు కల్లూరు లయన్స్‌క్లబ్ జోనల్ అధ్యక్షులు, కల్లూరు పట్టణ ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు చలువాది నగేష్, కుమారుడు వెంకట్ స్మరణితో ప్రథమ బహుమతి ప్రధానం చేయించగా.. ద్వితీయ, తృతీయ బహుమతులను దాత లయన్స్‌క్లబ్ సభ్యులు పసుమర్తి రాంబాబు అందించారు. ఈ కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం నివేదిత, యూటీఎఫ్ మండల కార్యదర్శి కె.విజయ్‌కుమార్‌లు, కల్లూరు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గంగుల నారాయణరావు, హెల్త్ కోఆర్డినేటర్ ఇందోజు రమేష్, జేవీవీ మండల అధ్యక్షుడు కేవీకే శర్మ పాల్గొన్నారు.


ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జెడ్పీ పాఠశాల, రేమిడిచర్ల, మీనవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల, బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందాయి. గెలుపొందిన విజేతలకు పాఠశాల హెచ్‌ఎం బి.మురళీమోహన్‌రావు, నిర్వాహకులు పి.భూషణ్‌రాజు, కాటయ్య బహుమతులు అందించారు.

పెనుబల్లి: విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వీఎంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు, లక్ష్యం టాలెంట్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీవీ రామారావు, వి.నాగేశ్వరరావు, వీరస్వామి, సోమ్లానాయక్, కెఎస్.ఎస్ రాజు, రామారావు, పుల్లారావు, ఎల్.బంగారం, ఈశ్వర్, నరసింహ నాయక్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

కారేపల్లి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కారేపల్లి మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో కారేపల్లి హైస్కూల్, తెలంగాణ మైనార్టీ స్కూల్, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు.. తెలుగు మాధ్యమంలో బాజుమల్లాయిగూడెం హై స్కూల్, కారేపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయం, కారేపల్లి హైస్కూల్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలువగా.. ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు మాధారం జేడీవీ, నిర్మలా హైస్కూల్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు కారేపల్లి ప్రముఖ ప్రజా వైద్యుడు రాఘవులు బహుమతులను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి బాలిన వెంకటరెడ్డి పాల్గొన్నారు.


ఏన్కూరు: ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో మండలంలోని బురధరాఘవాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు యలమందిని నంది, కమ్మగంటి మహిమ, బానోత్ ప్రియంక ప్రథమ బహుమతులు సాధించారు. విజేతకుల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు బహుమతులు అందించారు.

తల్లాడ: తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కుర్నవల్లి పాఠశాల విద్యార్థులు బి.జ్యోత్స్న 8వ తరగతి, ఆర్.నాగేశ్వరి 9వ తరగతి, వై.ఉమాశ్రీ పదో తరగతి ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థులకు కుర్నవల్లి పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ అభినందించారు.



తల్లాడ: విజేతలను అభినందిస్తున్న కుర్నవల్లి పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ

గ్యాస్ పాయింట్‌ను పునరుద్ధరించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు

వేంసూరు: వేంసూరులో మూత పడిన గ్యాస్ పాయింట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ శనివారం సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ ఎంఏ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏపూరి లతాదేవి మాట్లాడుతూ.. ఏజెన్సీ నిర్లక్ష్యంతోనే వేంసూరు గ్యాస్ పాయింట్ మూతపడిందిని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారులకు సకాలంలో గ్యాస్ అందించడంతో పాటు వేంసూరులో గ్యాస్ సరఫరా ఈకేవైసీ చేయాలని కోరారు. వేంసూరు మండలానికి చెందిన వేలాదిమంది సత్తుపల్లి వెళ్లి గ్యాస్ తెచ్చుకునేందుకు అదనంగా రూ.150 నుంచి రూ.200 ఖర్చు అవుతుందని.. వినియోగదారులపై అదనపు భారం తగ్గేవిధంగా చర్యలు తీసుకొని గ్యాస్ పాయింట్ పునరుద్ధరించాలన్నారు. లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకులు పోటు కళావతి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఇమ్మడిశెట్టి రామలక్ష్మి, షేక్ రంజాన్, రావి నారాయణరావులో సామ్రాజ్యం, వెంకటేశ్వరరావు, సుజాత, అయేషా పాల్గొన్నారు.